RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా

తెలుగు దినపత్రిక

www.nityamnigha.com

NITYAM NIGHA TELUGU DAILY

మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

Published From : Warangal

Circulated at : Telangana All Districts



బూర నగేష్ గౌడ్
ఎడిటర్

మండలాలవారీగా
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత
ఐడి కార్డు, ట్యాగ్, లోగో, వెహికల్ స్టిక్కర్స్ ఇవ్వబడును
ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు
94419 74025
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా



వరంగల్ | సంపుటి 2 | సంచిక 82 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | బుధవారం | 23.09.2026 | పేజీలు : 8

జూరాలకు నీళ్లివ్వండి

- కర్ణాటక సీఎంకు రేవంత్ ఫోన్

- జూరాలకు 5 టీఎంసీల నీరు ఇవ్వాలని కోరిన రేవంత్
- నీటి విడుదలకు శివకుమార్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం
- బెంగళూరులో శివకుమార్‌తో మంత్రులు, ఎమ్మెల్యేల భేటీ
- విడతల వారీగా నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి
- జూరాల నీటి కోసం రైతుల ఆందోళన



నిత్యం నిఘా, హైదరాబాద్ : ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి సమస్యపై సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. జూరాల ప్రాజెక్టుకు ఐదు టీఎంసీల నీటిని విడుదల చేయాలని కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌ను కోరారు. మంగళవారం ఫోన్‌లో మాట్లాడిన రేవంత్‌రెడ్డి.. జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను ఆయనకు వివరించారు. జూరాల నుంచి సాగునీరు అందక ఇప్పటికే సాగు చేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందని తెలిపారు. రైతుల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఐదు టీఎంసీల నీటిని జూరాలకు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై శివకుమార్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మంత్రులు జూపల్లి కృష్ణారావు, శ్రీహరి, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మేగా రెడ్డి, జి. మధుసూదన్‌రెడ్డి మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిశారు. కర్ణాటక సీఎంతో చర్చించాల్సిన అంశాలపై వారితో మాట్లాడారు. అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు బెంగళూరుకు బయలుదేరారు. మంగళవారం రాత్రి 8 గంటలకు శివకుమార్‌తో భేటీ కానున్నారు. జూరాలకు నీరు ఇచ్చేందుకు సానుకూలంగా స్పందించినందుకు ఆయనకు కృతజ్ఞతలు చెప్పనున్నారు. ఐదు టీఎంసీల నీటిని ఒకేసారి కాకుండా విడతల వారీగా విడుదల చేయాలని కోరనున్నారు. జూరాలకు సాగునీరు విడుదల చేయాలని కోరుతూ రైతులు ఇప్పటికే ఆందోళనకు దిగారు. ఈ ఆందోళనలకు బీఆర్ఎస్ మద్దతు ప్రకటించింది. బీజేపీ కూడా ఈ అంశంపై స్పందించింది. దీంతో జూరాల నీటి వ్యవహారం రాజకీయంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది.

కర్ణాటకలో 'వందేమాతరం' వివాదం..

డీకే శివకుమార్ ప్రభుత్వానికి గవర్నర్ వార్నింగ్



- 'వందేమాతరం' గీతంపై కర్ణాటక ప్రభుత్వానికి గవర్నర్ లేఖ
- గీతాన్ని రెండు చరణాలకే పరిమితం చేయడంపై తీవ్ర అభ్యంతరం
- ప్రభుత్వ ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధమని స్పష్టీకరణ
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అనవసర వివాదాలు తలెత్తుతాయని హెచ్చరిక

2

చర్చలు విఫలం.. 5 రోజులు బ్యాంకులు బంద్..!



- దేశవ్యాప్త సమ్మెకు బ్యాంకు సంఘాల పిలుపు
- సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల సమ్మె
- శని, ఆదివారాలతో కలిపి మొత్తం ఐదు రోజులు బ్యాంకులు బంద్
- వారానికి 5 రోజుల పని ప్రధాన డిమాండ్‌గా ఉన్న యూనియన్లు
- లావాదేవీలు ముందుగానే పూర్తి చేసుకోవాలని ప్రజలకు సూచన

2

ఆసియా క్రీడల్లో మహిళా క్రికెట్ జట్టుకు స్వర్ణం..
ప్రధాని మోదీ ట్వీట్



2

హైదరాబాద్‌ను ముంచెత్తిన వర్షం.. అధికారులను అప్రమత్తం చేసిన సీఎం రేవంత్ రెడ్డి

- హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షం
- వాయుగుండం ప్రభావంతో తెలంగాణకు 2 రోజుల వర్ష సూచన
- 8 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, 20 జిల్లాలకు భారీ వర్ష హెచ్చరిక
- అధికారులను అప్రమత్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

నిత్యం నిఘా, హైదరాబాద్ : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయు గుండం ప్రభావంతో హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రానున్న రెండు రోజుల పాటు తెలంగాణ వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి కూకట్‌పల్లి, ఆల్వాల్, బాలానగర్, మల్కాజిగిరి, బోయిన్‌పల్లి, అంబర్‌పేట, కోఠి, లక్డీకాపూల్ వంటి అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులపై వర్షపు నీరు భారీగా చేరడంతో పలుచోట్ల ట్రాఫిక్‌కు ....

2



విదేశీ ఉద్యోగాల మోసాలు..

- రాష్ట్రాలకు కేంద్ర హోం శాఖ కీలక హెచ్చరిక

- విదేశీ ఉద్యోగాల పేరుతో పెరుగుతున్న మోసాలపై రాష్ట్రాలకు కేంద్రం హెచ్చరిక
- అధిక జీతాల ఆశ చూపి సైబర్ నేరగాళ్లుగా మారుస్తున్నారని వెల్లడి
- నకిలీ ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలకు స్పష్టమైన ఆదేశంసోషల్
- మీడియా, జాబ్ పోర్టల్స్‌పై నిఘా పెట్టాలని కీలక సూచన
- అక్రమ ఏజెంట్లను గుర్తించేందుకు గ్రామ పంచాయతీల సహాయం తీసుకోవాలని సలహా



నిత్యం నిఘా, హైదరాబాద్ : విదేశీ ఉద్యోగాల పేరిట సాగుతున్న మానవ అక్రమ రవాణా, మోసాలు ఆందోళనకరంగా పెరిగిపోతుండటంపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను అప్రమత్తం చేస్తూ కీలక మార్గదర్శకాలతో కూడిన అడ్వైజరీని జారీ చేసింది. నకిలీ ఏజెంట్లపై ఉక్కుపాదం మోపాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అధిక వేతనాలు ఆశచూపి అమాయకులను ప్రలోభపెడుతున్న మోసగాళ్లు, వారిని అక్రమ మార్గాల్లో ("డాంకీ రూట్స్") విదేశాలకు తరలిస్తున్నారని కేంద్రం తన నివేదికలో పేర్కొంది. అక్కడ బాధితులను బంధించి, బలవంతంగా సైబర్ నేరాలు, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాల్లోకి నెడుతున్నారని హెచ్చరించింది. ఇటీవలి కాలంలో ఈ తరహా మోసాలు గణనీయంగా పెరిగినట్లు వెల్లడించింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవాల్సిన చర్యలను కేంద్రం నిర్దేశించింది. సోషల్ మీడియా, జాబ్ పోర్టల్స్‌లో వస్తున్న అనుమానాస్పద ఉద్యోగ ప్రకటనలపై సైబర్ సెల్స్ ద్వారా నిఘా ఉంచాలని సూచించింది. బాధితుల నుంచి డిజిటల్ సంభాషణలు, నగదు చెల్లింపుల రికార్డులను కీలక ఆధారాలుగా వెంటనే సేకరించాలని ఆదేశించింది....

2

జూబ్లీహిల్స్ సీఐ శ్రీనివాసులు రెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట

- మహిళను లైంగికంగా వేధించారనే ఆరోపణలు
- ఇప్పటికే సీఐపై సస్పెన్షన్ వేటు వేసిన ప్రభుత్వం
- శ్రీనివాసులు రెడ్డిని అరెస్ట్ చేయవద్దన్న సుప్రీంకోర్టు



2

నిమ్స్ వైద్యుడి నివాసంలో ఏసీబీ సోదాలు..

- 80 కోట్లకు పైగా ఆస్తుల గుర్తింపు

- నిమ్స్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీభాస్కర్‌పై ఏసీబీ దాడులు
- రూ.80 కోట్లకు పైగా విలువైన ఆస్తులను గుర్తించిన అధికారులు
- హైదరాబాద్, విశాఖ, ఇతర ప్రాంతాల్లో ఫ్లాట్లు, ప్లాట్లు, బంగారం
- బ్యాంకుల్లో రూ.41 లక్షల నగదు, ప్రైవేటు సంస్థల్లో రూ.35 లక్షల పెట్టుబడులు



2

మార్మోగుతున్న సారు పాట..
కేసీఆర్ పాటలతో యువత ఉర్రూతలు



- గణేశ్ శోభాయాత్రలో కేసీఆర్ నామజపం
- యూత్‌లో ఉప్పొంగుతున్న అభిమానం
- మైకులు లాక్కుంటున్నా లెక్కచేయని జెన్‌జీ
- రాష్ట్రవ్యాప్తంగా కేసీఆర్ మానియా ఆవిష్కృతం
- ట్యాంక్‌బండ్‌లో వారం రోజులుగా కేసీఆర్ వైబ్స్
- ఎస్ఎంలో కేసీఆర్ రీల్స్‌కు విశేష ఆదరణ

నిత్యం నిఘా, హైదరాబాద్ : రాష్ట్రంలో తిరిగి కేసీఆర్ పాలనా దృశ్యం పునరావిష్కరణ అవుతుందా? తెలంగాణ ప్రజలు పోగొట్టుకున్న చోటే తిరిగి వెతుక్కుంటున్నా రా? మునుపెన్నడూ లేనివిధంగా కేసీఆరే తిరిగి అధికారంలోకి రావాలని తమ కేరింతలతో నేటి జెన్‌జీ తరం ఆహ్వానిస్తున్నదా? అంటే అవుననే అంటున్నాయి గణేశ్ నిమ జ్జన శోభాయాత్రలు. ఒకవైపు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై బురదజల్లడమే పనిగా సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ పెట్టుకోగా.. అదే కేసీఆరే రేపటి ప్రత్యామ్నాయం, ఆయన ఆనవాళ్లే సత్యం, ఆయన ..

2

విదేశీ ఉద్యోగాల మోసాలు..

- రాష్ట్రాలకు కేంద్ర హోం శాఖ కీలక హెచ్చరిక

మొదటిపేజీ తరువాయి.. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రొటెక్టర్ ఆఫ్ ఎమిగ్రెంట్స్ అనుమతి లేకుండా నడుస్తున్న ఏజెన్సీలను తక్షణమే మూసివేయాలని స్పష్టం చేసింది. నకిలీ ఏజెంట్లపై మానవ అక్రమ రవాణా నిరోధక చట్టం (యాంటీ ట్రాఫికింగ్) కింద కఠిన కేసులు నమోదు చేసి, సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ఆదేశించింది. అక్రమ వలసల ముప్పుపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ 'ఇ-మైగ్రేట్' పోర్టల్‌ను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించింది. అనధికార ఏజెంట్లను గుర్తించే ప్రక్రియలో గ్రామ పంచాయతీలను సైతం భాగస్వాములను చేయాలని కేంద్రం పేర్కొంది.

చర్చలు విఫలం..

5 రోజులు బ్యాంకులు బంద్..!

మొదటిపేజీ తరువాయి.. దేశవ్యాప్తంగా బ్యాంకింగ్ సేవలకు మరోసారి అంతరాయం ఏర్పడనుంది. బ్యాంకు యూనియన్లు, ప్రభుత్వ ప్రతినిధుల మధ్య జరిగిన చర్చలు విఫలం కావడంతో, యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది. ఫలితంగా సెప్టెంబర్ చివరి వారంలో వరుసగా ఐదు రోజుల పాటు బ్యాంకులు మూతపడనున్నాయి. వారానికి ఐదు రోజుల పనిదినాలు, ఇతర పెండింగ్ సమస్యల పరిష్కారం కోరుతూ బ్యాంకు సంఘాలు కొంతకాలంగా నిరసనలు తెలుపుతున్నాయి. ఈ క్రమంలో ఆర్థిక శాఖ సూచన మేరకు మంగళవారం డిప్యూటీ లేబర్ కమిషనర్‌తో జరిపిన చర్చలు ఫలప్రదం కాలేదు. ఐదు రోజుల పని విధానం అంశం పరిశీలనలో ఉందని ప్రభుత్వం పేర్కొన్నప్పటికీ, స్పష్టమైన హామీ లభించకపోవడంతో యూనియన్లు అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు సమ్మె చేపట్టాలని నిర్ణయించాయి. సమ్మెకు ముందు సెప్టెంబర్ 26, 27 తేదీల్లో శని, ఆదివారాలు కావడంతో బ్యాంకులకు సాధారణ సెలవులు ఉన్నాయి. దీంతో మొత్తం ఐదు రోజుల పాటు బ్యాంకింగ్ లావాదేవీలు పూర్తిగా నిలిచిపోనున్నాయి. ఇదే డిమాండ్లతో ఈ నెల 11న కూడా బ్యాంకు సంఘాలు సమ్మె నిర్వహించిన విషయం విదితమే. ఈ పరిణామాల దృష్ట్యా, వినియోగదారులు తమ ముఖ్యమైన ఆర్థిక లావాదేవీలను ముందుగానే పూర్తి చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

నిమ్స్ వైద్యుడి నివాసంలో ఏసీబీ సోదాలు.. రూ. 80 కోట్లకు పైగా ఆస్తుల గుర్తింపు

మొదటిపేజీ తరువాయి.. హైదరాబాద్‌లోని ప్రతిష్టాత్మక నిమ్స్ ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నోరి లక్ష్మీభాస్కర్ నివాసంలో భారీగా ఆస్తులు వెలుగుచూశాయి. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలతో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం ఏకకాలంలో ఆయన నివాసం, కార్యాలయంతో పాటు మరో ఏడు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు రూ .80 కోట్లకు పైగా విలువైన స్థిర, చరాస్తులను గుర్తించడంతో అధికారులు విస్తుపోయారు. ఏసీబీ గుర్తించిన ఆస్తుల వివరాల ప్రకారం, కూకట్‌పల్లిలో రెండు విలాసవంతమైన ఫ్లాట్లు, మణికొండ, పేట్ బషీరాబాద్ ప్రాంతాల్లో మరో ఐదు ఫ్లాట్లు ఉన్నాయి. వీటితో పాటు యాదాద్రి, నందిగామ, శామీర్‌పేటలో నాలుగు ఓపెన్ ప్లాట్లు, విశాఖపట్నంలో 800 గజాల స్థలం ఉన్నట్లు తేలింది. అలాగే, వివిధ బ్యాంకు ఖాతాల్లో రూ. 41 లక్షల నగదు, పోస్టాఫీసు ఖాతాల్లో రూ. 12 లక్షల డిపాజిట్లు, ఒక ప్రైవేటు సంస్థలో రూ. 35 లక్షల పెట్టుబడులు ఉన్నట్లు అధికారులు కనుగొన్నారు. వీటితో పాటు 517 గ్రాముల బంగారం, మూడు కార్లు, నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. డాక్టర్ లక్ష్మీభాస్కర్ గత 20 ఏళ్లుగా నిమ్స్‌లో పనిచేస్తుండగా, గత ఐదేళ్లుగా డిప్యూటీ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయనపై గతంలోనూ పలు ఆరోపణలు వచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం ఏసీబీ అధికారులు లభ్యమైన ఆస్తుల పూర్తి విలువను అంచనా వేసే పనిలో నిమగ్నమయ్యారు.

జూబ్లీహిల్స్ సీఐ శ్రీనివాసులు రెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట

మొదటిపేజీ తరువాయి.. మహిళపై లైంగిక వేధింపులు, బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడి బలవంతంగా అబార్షన్ చేయించారనే తీవ్ర ఆరోపణలతో సస్పెన్షన్‌కు గురైన జూబ్లీహిల్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డికి దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో స్వల్ప ఊరట లభించింది. ఈ కేసులో తదుపరి విచారణ జరిగే వరకు శ్రీనివాసులు రెడ్డిని అరెస్టు చేయవద్దని, ఆయనపై ఎలాంటి బలవంతపు చట్టపరమైన చర్యలు తీసుకోవద్దని హైదరాబాద్ పోలీసులకు సుప్రీంకోర్టు స్పష్టమైన మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్ మహాదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌పై ఈరోజు సుదీర్ఘ విచారణ చేపట్టింది. బాధితురాలిని లైంగికంగా వేధించారనే ఆరోపణలపై గతంలో తెలంగాణ ప్రభుత్వం ఆయనపై సస్పెన్షన్ వేటు వేసింది. ఈ క్రమంలో అరెస్టు నుంచి మినహాయింపు కోరుతూ ముందస్తు బెయిల్ కోసం ఆయన తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా, అక్కడ ఆయన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ శ్రీనివాసుల రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో, సర్వోన్నత న్యాయస్థానం విచారణ చేపట్టి పోలీసులకు రక్షణ ఉత్తర్వులు జారీ చేస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

హైదరాబాద్‌ను ముంచెత్తిన వర్షం.. అధికారులను అప్రమత్తం చేసిన సీఎం రేవంత్

మొదటిపేజీ తరువాయి.. తీవ్ర అంతరాయం కలిగింది. ముఖ్యంగా షేక్‌పేట పరిసర ప్రాంతాల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాయుగుండం ప్రభావంతో మంగళ, బుధవారాల్లో రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ క్రమంలో పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం సహా ఎనిమిది జిల్లాలకు 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేయగా, మరో 20 జిల్లాలకు భారీ వర్ష సూచన జారీ చేసింది. భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలవకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని సూచించారు. సహాయక బృందాలు, కంట్రోల్ రూమ్‌లు 24 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

కర్ణాటకలో 'వందేమాతరం' వివాదం..

- డీకే శివకుమార్ ప్రభుత్వానికి గవర్నర్ వార్నింగ్

మొదటిపేజీ తరువాయి.. జాతీయ గీతం 'వందేమాతరం' గానంపై కర్ణాటక ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు వివాదాస్పదంగా మారాయి. ఈ వ్యవహారంపై రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో 'వందేమాతరం' గీతాన్ని కేవలం రెండు చరణాలకే పరిమితం చేయడాన్ని తప్పుబడుతూ ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు ఆయన లేఖ రాశారు. ఈ ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధమని, వీటిని వెంటనే పునఃపరిశీలించాలని ఆయన కోరారు. 2026 సెప్టెంబర్ 8వ తేదీన కాంగ్రెస్ నేతృత్వంలోని కర్ణాటక ప్రభుత్వం ఒక జీవో జారీ చేసింది. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని లేదా గవర్నర్ హాజరయ్యే కార్యక్రమాలు మినహా, ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లో 'వందేమాతరం' గీతంలోని మొదటి రెండు చరణాలు మాత్రమే పాడాలని అందులో పేర్కొంది. అయితే, జాతీయ గౌరవ పరిరక్షణ చట్టం-2026 సవరణ ప్రకారం జాతీయ గీతానికి కూడా చట్టబద్ధమైన రక్షణ ఉందని గవర్నర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలకు, జాతీయ గౌరవ పరిరక్షణ చట్టానికి విరుద్ధంగా ఉన్నాయని గవర్నర్ తన లేఖలో స్పష్టం చేశారు. జాతీయ చిహ్నాలపై నిర్ణయం తీసుకునే అధికారం కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వస్తుందని, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి శాసన, కార్యనిర్వాహక అధికారాలు లేవని రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 162, 256, 257(1)ను ఆయన ఉటంకించారు. ఈ ఉత్తర్వులను ఇలాగే కొనసాగిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అనవసర వివాదాలు తలెత్తడమే కాకుండా, రాజ్యాంగపరమైన చిక్కులకు దారితీస్తుందని గవర్నర్ హెచ్చరించారు. కావున, 'వందేమాతరం' పాడే విషయంలో కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన సూచించారు.

ఆసియా క్రీడల్లో మహిళా క్రికెట్ జట్టుకు స్వర్ణం.. ప్రధాని మోదీ ట్వీట్

మొదటిపేజీ తరువాయి..

ఆసియా క్రీడలు-2026లో భారత్ స్వర్ణ పతకాల ఖాతాను ఘనంగా ప్రారంభించింది. భారత మహిళా క్రికెట్ జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచి, ఈ ఎడిషన్‌లో దేశానికి తొలి బంగారు పతకాన్ని అందించింది. ఫైనల్ పోరులో శ్రీలంకను 147 పరుగుల భారీ తేడాతో ఓడించి, వరుసగా రెండోసారి స్వర్ణాన్ని కైవసం చేసుకుంది. హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమ్ఇండియా టోర్నీ ఆద్యంతం తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఈ చారిత్రక విజయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందిస్తూ జట్టుకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. "భారత క్రికెట్‌కు ఇదొక అద్భుతమైన విజయం. మన క్రీడాకారిణులు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించడం అభినందనీయం. వారి ఆత్మవిశ్వాసం, నైపుణ్యం, సమష్టి కృషి అమోఘం. ఈ విజయంతో దేశం గర్విస్తోంది. మీరు యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచారు" అని మోదీ ప్రశంసించారు. మరోవైపు ఆసియా క్రీడల్లో తొలిసారిగా ప్రవేశపెట్టిన ఎంఎంఏ విభాగంలో పతకం సాధించిన సుచికా తరియల్‌ను కూడా ప్రధానమంత్రి అభినందించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సైతం భారత జట్టును అభినందించారు. ఈ విజయం చరిత్రలో నిలిచిపోతుందని, రాబోయే తరాలకు, ముఖ్యంగా దేశంలోని యువతకు ఇది గొప్ప స్ఫూర్తిదాయకమని కొనియాడారు. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండుల్కర్ స్పందిస్తూ, షఫాలీ వర్మ, స్మృతి మంధానల అద్భుత భాగస్వామ్యాన్ని, బౌలర్ల ప్రతిభను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ చారిత్రక విజయంతో భారత మహిళా జట్టుపై దేశవ్యాప్తంగా ప్రశంసల వర్షం కురుస్తోంది.

ట్రంప్‌కు జై కొట్టినా.. భారత సంతతికి తప్పని అవమానాలు!

- ట్రంప్‌కు మద్దతిస్తున్న భారత సంతతికి జాత్యహంకార వ్యాఖ్యలు
- భావజాలం కన్నా జాతే ముఖ్యమంటున్న కొందరు ట్రంప్ మద్దతుదారులు
- భారత సంతతి నేత హర్మీత్ ధిల్లాన్‌పై సొంత వర్గం నుంచే దాడి
- గతంలో ప్రోగ్రెసివ్‌లకే పరిమితమైన దాడులు.. ఇప్పుడు కన్జర్వేటివ్‌లపైనా
- "అసలైన అమెరికన్" అని నిరూపించుకోవాల్సిన దుస్థితి

నిత్యం నిఘా, అంతర్జాతీయం :

అమెరికాలో డొనాల్డ్ ట్రంప్, ఆయన 'మాగా' (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్) ఉద్యమానికి గట్టి మద్దతుదారులుగా ఉన్న భారత సంతతి కన్జర్వేటివ్‌లకు ప్రస్తుతం అనూహ్య అనుభవాలు ఎదురవుతున్నాయి. తమ భావజాలం తమను అమెరికన్‌లుగా పూర్తిస్థాయిలో గుర్తిస్తుందని వారు భావిస్తున్నప్పటికీ, వారిలో కొందరు సొంత పార్టీ నుంచే జాత్యహంకార వ్యాఖ్యలను, వివక్షను ఎదుర్కోవడం చర్చనీయాంశంగా మారింది. ట్రంప్ రాజకీయాల్లో భావజాలానికే ప్రాధాన్యత ఉంటుందని, జాతి, మూలాలకు తావుండదని చాలా మంది భారతీయ-అమెరికన్లు విశ్వసించారు. అయితే, ఇటీవలి పరిణామాలు దీనికి భిన్నంగా ఉన్నాయి. వారు భావజాల పరంగా తమ నిబద్ధతను చాటుకున్నప్పటికీ, "మీరు ఎంతవరకు అమెరికన్లు?" అనే ప్రశ్నలను ఎదుర్కోవాల్సి వస్తోందని ప్రముఖ కాలమిస్ట్ చిదానంద్ రాజఘట్ట తన కథనంలో విశ్లేషించారు. ట్రంప్ ప్రభుత్వంలో పని చేస్తున్న చండీగఢ్ మూలాలున్న హర్మీత్ ధిల్లాన్, తనను తాను అమెరికన్‌గా చాటుకునేందుకు బీఫ్ డిన్నర్ ఫొటో పోస్ట్ చేశారు. దీనిపై 'మాగా' మద్దతుదారులే ఆమెను ఎగతాళి చేశారు. తనను 'పేపర్‌వర్క్ అమెరికన్' అంటూ రోజూ జాత్యహంకార వ్యాఖ్యలు ఎదుర్కొంటున్నానని ఆమె స్వయంగా తెలిపారు. అలాగే, దినేశ్ డిసౌజా తన కుమార్తెపై వచ్చిన జాతి వివక్ష దాడిని తిప్పికొట్టేందుకు, ఆమె తల్లి శ్వేతజాతీయురాలని చెప్పాల్సి రావడం విమర్శలకు దారి



తీసింది. గతంలో వివేక్ రామస్వామి, నిక్కీ హేలీ వంటి వారు కూడా తమ అమెరికన్ గుర్తింపును నిరూపించుకోవడానికి ప్రయత్నించాల్సి వచ్చింది. సాధారణంగా ప్రగతిశీల భావాజాలం కలిగిన ప్రమీలా జయపాల్ వంటి నేతలు 'మీ దేశానికి తిరిగి వెళ్లండి' వంటి విమర్శలను మొదటి నుంచీ ఎదుర్కొంటున్నారు. అయితే, ఇప్పుడు ట్రంప్ వాదాన్ని అత్యంత బలంగా వినిపిస్తున్న కన్జర్వేటివ్‌లు సైతం అదే వర్గం నుంచి ఇటువంటి వివక్షను ఎదుర్కోవడం గమనార్హం.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

ప్రజల వద్దకే న్యాయవ్యవస్థ

- **గ్రామీణ ప్రజలకు న్యాయ హక్కులపై అవగాహన కల్పించడమే లక్ష్యం: సీనియర్ సివిల్ జడ్జి హైమా పూజిత**



ఎల్కతుర్తి, సెప్టెంబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి): ప్రజలకు న్యాయంపై అవగాహన కల్పించడంతో పాటు పేదలకు ఉచిత న్యాయ సహాయం అందించేందుకు న్యాయవ్యవస్థ ప్రజల వద్దకే వస్తోందని హన్మకొండ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధి నేరెళ్ల వెంకట హైమా పూజిత అన్నారు.మంగళవారం ఎల్కతుర్తి మండలంలోని స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ మునిగడప లావణ్య ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హైమా పూజిత మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ చట్టాలు, న్యాయపరమైన హక్కులపై పూర్తి అవగాహన ఉండక పోవచ్చని, గ్రామీణ ప్రాంత ప్రజలకు న్యాయంపై అవగాహన కల్పించేందుకే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.భూములు కొనుగోలు చేసే సమయంలో ప్రజలు తొందరపడకుండా ముందుగా భూమిని సర్వే చేయించుకోవాలని, ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్ (ఈసీ) పరిశీలించిన తర్వాతే కొనుగోలు చేయాలని సూచించారు. లేకపోతే భవిష్యత్తులో న్యాయపరమైన సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు.చిన్నారులకు మంచి విద్య అందించడం తల్లిదండ్రుల బాధ్యత అన్నారు. బాలలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని, బాల కార్మిక వ్యవస్థను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. బాల్య వివాహాలను నిరోధించాలని, బాలికలకు 18 సంవత్సరాలు, బాలురకు 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం చేయాలని సూచించారు. బాల్య వివాహం జరుగుతున్నట్లు తెలిస్తే 1098కు సమాచారం అందించాలని తెలిపారు.సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. గుర్తుతెలియని వ్యక్తులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీ చెప్పకూడదని, ఓటీపీ వెల్లడించడం వల్ల పలువురు డబ్బులు కోల్పోతున్నారని తెలిపారు. పిల్లలకు సెల్‌ఫోన్ ఇచ్చే విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అడ్వైజర్ రవికుమార్ మాట్లాడుతూ గతంలో న్యాయం కోసం ప్రజలు జిల్లా కేంద్రంలోని కోర్టులకు వెళ్లాల్సి వచ్చేదని, దీనివల్ల గ్రామీణ ప్రాంత ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనేవారని తెలిపారు. న్యాయ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు మొబైల్ కోర్టుల ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయని, భవిష్యత్తులో మరిన్ని ప్రాంతాలకు ఈ సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు.కార్యక్రమంలో ఎంపీడీవో ఎన్. విజయకుమార్, డిప్యూటీ తహసీల్దార్ రమేష్, ఉపసర్పంచ్ రాజు, టైపిస్ట్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పరివర్తన ఏకాదశి

- **విష్ణుమూర్తి శయన భంగిమలో పరివర్తనం**
- **వామనావతారంతో ముడిపడిన విశిష్టత**



నిత్యం నిఘా స్పెషల్ :
భాద్రపద శుద్ధ ఏకాదశిని పరివర్తన ఏకాదశిగా పిలుస్తారు. ఆషాఢ శుద్ధ ఏకాదశి రోజున శేషతల్పంపై యోగనిద్రలోకి వెళ్లిన శ్రీమహావిష్ణువు ఈ రోజున ఒక వైపు నుంచి మరో వైపునకు పరివర్తనం చెందుతాడనే విశ్వాసంతో ఈ ఏకాదశికి ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది. పరివర్తన ఏకాదశి రోజున ఉపవాసం ఉండి శ్రీమహావిష్ణువును భక్తిశ్రద్ధలతో పూజిస్తే పాపాలు తొలగి పుణ్యఫలాలు లభిస్తాయని భక్తుల విశ్వాసం. దశమి రాత్రి నుంచి ఉపవాస దీక్ష చేపట్టి, ఏకాదశి ఉదయం స్నానం చేసి పరిశుభ్రమైన వస్త్రాలు ధరించి విష్ణుమూర్తిని పూజించడం, జాగరణ చేయడం సంప్రదాయంగా వస్తోంది.

ఈ సందర్భంగా భక్తులు
"వాసుదేవ జగన్నాథ!
ప్రాప్తేయం ద్వాదశీ తవ!
పార్శ్వేన పరివర్తస్య!
సుఖం స్వాపిహి మాధవ!!"
అనే శ్లోకాన్ని పఠిస్తూ శ్రీమహావిష్ణువును ఆరాధిస్తారు.

వామనావతారంతో ప్రత్యేక అనుబంధం
భాద్రపద శుద్ధ ద్వాదశి వామన జయంతిగా కూడా ప్రసిద్ధి చెందింది. పురాణ కథనం ప్రకారం అదితి దేవి పయోవ్రతం ఆచరించగా, ఆమెకు పుత్రునిగా శ్రీమహావిష్ణువు వామనుడి రూపంలో అవతరించాడు. అనంతరం వామనుడు బలిచక్రవర్తి నిర్వహిస్తున్న అశ్వమేధ యజ్ఞానికి వెళ్లి మూడు అడుగుల భూమిని దానంగా కోరాడు. శుక్రాచార్యుడు దానం చేయవద్దని బలిచక్రవర్తిని హెచ్చరించినప్పటికీ, ఇచ్చిన మాటను నిలబెట్టుకునేందుకు బలి వామనుడి కోరికను అంగీకరించాడు. వామనుడు విరాట్రూపం ధరించి ఒక అడుగుతో భూమిని, రెండో అడుగుతో స్వర్గాన్ని కొలిచాడు. మూడో అడుగుకు స్థలం లేకపోవడంతో బలిచక్రవర్తి తన శిరస్సును సమర్పించుకున్నట్లు పురాణాల్లో పేర్కొంటారు. ఈ విధంగా పరివర్తన ఏకాదశి, వామన ద్వాదశి రోజులకు వైష్ణవ సంప్రదాయంలో ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉందని భక్తులు విశ్వసిస్తారు

రైతు గుర్తింపు నంబర్ కోసం ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి

- **ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి : అధికారులు**






ఎల్కతుర్తి, సెప్టెంబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి): రైతులు తప్పనిసరిగా రైతు గుర్తింపు నంబర్ పొందేందుకు ఫార్మర్ రిజిస్ట్రీలో తమ వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. మంగళవారం ఎల్కతుర్తి రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, సహాయ సంచాలకులు ఆదిరెడ్డి, నూతన సింగిల్ విండో చైర్మన్ ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ రైతులు రైతు గుర్తింపు నంబర్ కోసం ఫార్మర్ రిజిస్ట్రీలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఏఈఓలు, మీ–సేవ కేంద్రాలు, కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు.రైతు గుర్తింపు నంబర్ ద్వారా ఎరువుల కొనుగోలు, పంటల విక్రయం, బ్యాంకుల ద్వారా రుణాలు పొందడం తదితర ప్రభుత్వ సేవలను పొందేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. గుర్తింపు నంబర్ లేకపోతే ఆయా సేవలు పొందడంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు.సెప్టెంబర్ 22 నుంచి 30వ తేదీ వరకు గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు.అనంతరం నూతనంగా ఎన్నికైన సింగిల్ విండో చైర్మన్ ఎలిగేటి ఇంద్రసేనారెడ్డిని జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, సహాయ సంచాలకులు ఆదిరెడ్డి సన్మానించారు. సూరారం గ్రామానికి చెందిన తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్ అవార్డు అందుకున్న సందర్భంగా ఆయనను కూడా సన్మానించారు.కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎం. రాజకుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు పున్నం చందర్, బాబు, వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

కాపువాడలో కాకతీయుల కాలం నాటి
గణనాథుడి నమూనా

- **దామెర చెరువు కట్టపై ఉన్న పురాతన వినాయక విగ్రహం, రాతి మండపం స్ఫూర్తితో ఏర్పాటు**



వరంగల్, సెప్టెంబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ నగరంలోని 42వ డివిజన్ రంగశాయిపేట శివారులో దామెర చెరువు కట్టపై ఉన్న కాకతీయుల కాలం నాటి వినాయక విగ్రహం, రాతి మండపం నమూనాను కాపువాడలో ఏర్పాటు చేశారు. శ్రీ సుభాష్ చంద్రబోస్ పరపతి సంఘం ఆవరణలో శ్రీ సుభాష్ చంద్రబోస్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఈ నమూనాతో గణనాథుడిని ప్రతిష్ఠించారు.దామెర చెరువు కింద ఆరుగాలం కష్టపడి పంటలు సాగుచేసే రైతులకు ఆశీర్వచనాలు అందిస్తున్నట్లుగా భావించే ఈ పురాతన గణనాథుడి విశిష్టతను ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ నమూనాను ఏర్పాటు చేసినట్లు యూత్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు.కాకతీయుల కాలం నాటి చారిత్రక కట్టడాలు, దేవాలయాలు, చెరువులు వరంగల్ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఓరుగల్లు పరిధిలో కాకతీయులు నిర్మించిన గొలుసుకట్టు చెరువులు, వారసత్వ దేవాలయాలు, పురాతన కట్టడాలను పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.ఈ సందర్భంగా శ్రీ సుభాష్ చంద్రబోస్ యూత్ అసోసియేషన్ కమిటీ సభ్యులు పాల్గొని గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు..

ఎంజీఎం సందర్శనకు వెళ్లిన వినయ్ భాస్కర్‌ను అడ్డుకున్న పోలీసులు

తోపులాటలో గాయాలు.. రోడ్డుపై బైఠాయించి నిరసన



వరంగల్, సెప్టెంబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిని సందర్శించేందుకు వెళ్లిన ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌ను పోలీసులు అడ్డుకున్నారు. ఆసుపత్రిలోకి వెళ్లేందుకు ఆయన ప్రయత్నించగా పోలీసులతో తోపులాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో వినయ్ భాస్కర్ కాలు, చేతికి గాయాలై రక్తస్రావమైనట్లు ఆయన వర్గాలు తెలిపాయి. అనంతరం ఆయన రోడ్డుపైనే బైఠాయించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న 'ప్రజా పాలన'కు భిన్నంగా పేదలకు కనీస వైద్య సదుపాయాలు అందడం లేదని విమర్శించారు. ఎంజీఎం ఆసుపత్రిలో బెడ్ల కొరత, భవనాల పరిస్థితి, అంబులెన్స్‌ల కొరత వంటి సమస్యలతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు.ఆసుపత్రిలోని పరిస్థితులను పరిశీలించేందుకు వచ్చిన తనను పోలీసులు అడ్డుకోవడం సమంజసం కాదని అన్నారు. ఎంజీఎం సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి పేదలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

శంభునిపేటలో ఘనంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు

● గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎర్రబెల్లి ప్రదీప్‌రావు



వరంగల్, సెప్టెంబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ 41వ డివిజన్ శంభునిపేట విశ్వనాథ కాలనీలో శ్రీ గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొన సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు శ్రీ అభయాంజనేయ స్వామి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి గణపతి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీజేపీ నాయకుడు, అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు హాజరై విఘ్నేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ జాగర్లపూడి కోటేశ్వరరావు మంత్రోచ్ఛారణల మధ్య పూజా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఓబీసీ కార్యదర్శి, కాలనీ అధ్యక్షుడు కర్నె రవీందర్, డివిజన్ అధ్యక్షుడు కర్ణి వాసుదేవ్‌తో పాటు మహిళలు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అన్నారం షరీఫ్‌లో గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

● స్వచ్ఛత హీ సేవలో భాగంగా శ్రమదానం



పర్వతగిరి, సెప్టెంబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి): పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ గ్రామంలోని చెరువు వద్ద గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లను మంగళవారం అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామ చెరువు వద్ద నిమజ్జనానికి సంబంధించిన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, పారిశుధ్య పరిస్థితులను గ్రామపంచాయతీ కార్యదర్శి నిమ్మల రాజు, సర్పంచ్ గాడిపల్లి మహేందర్ గౌడ్, పాలకవర్గ సభ్యులు పరిశీలించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.అనంతరం 'స్వచ్ఛత హీ సేవ' కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీ అధికారులు, సిబ్బంది శ్రమదానం చేపట్టారు. చెరువు పరిసరాలు, గ్రామంలోని పలు ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టారు. ప్రజలు కూడా స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని అధికారులు సూచించారు.

ఇబ్రహీంపూర్‌లో గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

● స్వచ్ఛత హీ సేవలో భాగంగా శ్రమదానం





జనగామ జిల్లా /రఘునాథ పల్లి, సెప్టెంబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి): రఘునాథ పల్లి మండలం ఇబ్రహీంపూర్ గ్రామంలో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లను మంగళవారం అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. గ్రామ చెరువు వద్ద నిమజ్జనానికి సంబంధించిన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, పారిశుధ్య పరిస్థితులను ఎంపీడీవో కావ్య శ్రీనివాసన్, సీఐ వేణు, ఎస్ఐ నరేష్ పరిశీలించారు. నిమజ్జన సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. చెరువు పరిసరాల్లో పారిశుధ్యం, విద్యుత్, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. అనంతరం 'స్వచ్ఛత హీ సేవ' కార్యక్రమంలో భాగంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో కలిసి శ్రమదానం నిర్వహించారు. గ్రామ పరిసరాలను శుభ్రం చేస్తూ పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌రెడ్డి, జిల్లా నాయకుడు గొట్టం భాస్కర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నార్మద, సర్పంచ్ పోకల శ్రీనివాస్, ఉపసర్పంచ్ చింత నరేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు మేడిపల్లి నరేష్, వార్డు సభ్యులు, ఆశా కార్యకర్తలు, మహిళలు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలి

- అధికారుల సమన్వయంతో భద్రతా చర్యలు చేపట్టాలి : కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



హనుమకొండ, సెప్టెంబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండ జిల్లా వ్యాప్తంగా గణేశ్ నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా, సురక్షిత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. నిమజ్జన ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నిమజ్జనం జరిగే చెరువులు, కాలువలు, ప్రధాన జలాశయాల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. నిమజ్జన ఘాట్ల వద్ద శిక్షణ పొందిన ఈతగాళ్లు, అవసరమైన బోట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అత్యవసర వైద్య సేవల కోసం 108 అంబులెన్సులు, ప్రత్యేక వైద్య బృందాలను సిద్ధంగా ఉంచాలని, భారీ విగ్రహాల నిమజ్జనం కోసం తగినన్ని క్రేన్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రమాదాల నివారణకు అగ్నిమాపక సిబ్బందిని కూడా నిరంతరం అందుబాటులో ఉంచాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాలు, ప్రధాన ఊరేగింపు మార్గాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలని, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సదుపాయం, అవసరమైన చోట్ల నీటి ట్యాంకర్లను ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండి ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి గణేశ్ నిమజ్జన వేడుకలను విజయవంతంగా నిర్వహించాలని ఆమె ఆదేశించారు.

అన్నారం షరీఫ్‌లో పంచాయతీ సిబ్బంది తీరుపై విమర్శలు





పర్వతగిరి, సెప్టెంబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి): పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ గ్రామపంచాయతీ సిబ్బంది పనితీరుపై ప్రశ్నించిన వారితో సిబ్బంది వెంకట సాయి వాగ్వాదానికి దిగినట్లు ఆరోపణలు వచ్చాయి. గ్రామంలో కాలువల శుభ్రత, పారిశుధ్య నిర్వహణపై ప్రశ్నించిన సందర్భంలో తనను ప్రశ్నించడంపై సిబ్బంది అసహనం వ్యక్తం చేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. కాలువల శుభ్రత విషయంలో వార్డు సభ్యులు ప్రశ్నించిన సందర్భంలోనూ సిబ్బంది సమాధానం చెప్పే తీరు సరిగా లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామపంచాయతీ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి, పారిశుధ్య పనులను క్రమం తప్పకుండా నిర్వహించాలని వారు కోరుతున్నారు. ఈ వ్యవహారంపై గ్రామపంచాయతీ కార్యదర్శి నిమ్మల రాజును వివరణ కోరగా, సిబ్బందిపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందిస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా సర్పంచ్ గాడిపల్లి మహేందర్ గౌడ్‌కు విషయం తెలియజేయగా, గ్రామపంచాయతీలో పనిచేస్తున్న సిబ్బందిని పిలిపించి ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్త వహించాలని సూచించినట్లు తెలిపారు. పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులను నిరంతరం పర్యవేక్షించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కటాపూర్‌లో ఉచిత మొబైల్ ఏఐ చెస్ట్ ఎక్స్‌రే స్క్రీనింగ్ క్యాంపు

60 మందికి ఎక్స్‌రే స్క్రీనింగ్.. వైద్య పరీక్షలు



ములుగు జిల్లా /తాడ్వాయి, సెప్టెంబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం కటాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కటాపూర్ గ్రామపంచాయతీలో జిల్లా క్షయ నివారణ కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత మొబైల్ ఏఐ చెస్ట్ ఎక్స్‌రే స్క్రీనింగ్ క్యాంపును మంగళవారం నిర్వహించారు. కటాపూర్, దామరవాయి, నర్సాపూర్ గ్రామాల నుంచి సుమారు 60 మంది ఈ శిబిరానికి హాజరై ఎక్స్‌రే స్క్రీనింగ్ చేయించుకున్నారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించారు.కటాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రంజిత్ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ క్షయ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, జిల్లా క్షయ నివారణ అధికారి ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఇలాంటి స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా మధుమేహం, అధిక రక్తపోటు ఉన్నవారు, జ్వరం, దీర్ఘకాలిక దగ్గు వంటి లక్షణాలు ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని చెస్ట్ ఎక్స్‌రే స్క్రీనింగ్ చేయించుకోవాలని సూచించారు. ఆధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత ద్వారా సుమారు 10 నిమిషాల్లో ఎక్స్‌రే స్క్రీనింగ్ ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దిద్దె మోహన్‌రావు, ఉపసర్పంచ్ పాలకుర్తి వెంకటరామ నర్సయ్య, పంచాయతీ కార్యదర్శి భాగ్యరాణి, ఏఎన్ఎం ఎస్. గంగా, హెల్త్ అసిస్టెంట్ ముత్తయ్య, అనిల్, టీబీ అలెర్ట్ ఇండియా ప్రతినిధులు, ఏసీఎఫ్ కోఆర్డినేటర్ టీ. రాజు, ఎక్స్‌రే టెక్నీషియన్ సంతోష్, కమ్యూనిటీ మొబిలైజర్ విజయ్, ఆశా కార్యకర్తలు కవిత, రోజారాణి, అనిత తదితరులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

రాజకీయాలకు అతీతంగా రైతులను ఆదుకోవాలి

- **పంటలను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలి: బీజేపీ నాయకురాలు రావు పద్మ**

హనుమకొండ, సెప్టెంబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి): రాష్ట్రంలో నెలకొన్న సాగునీటి సమస్యతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రాజకీయాలకు అతీతంగా రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు రావు పద్మ డిమాండ్ చేశారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పంటలకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జలాశయాలు, ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటిని పంటల అవసరాలకు అనుగుణంగా వినియోగించి ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. సాగునీటి సమస్యపై రైతుల ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో జూరాల ప్రాజెక్టు పరిధిలోని రైతులు కూడా పంటలకు నీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. సెప్టెంబర్ 22న జూరాల ప్రాజెక్టు వద్ద రైతులను కలిసేందుకు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావును జడ్చర్ల వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు పలు వార్తా సంస్థలు వెల్లడించాయి. ఈ సందర్భంగా రామచందర్‌రావు అరెస్టును రావు పద్మ ఖండించారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రతిపక్ష నాయకులను అడ్డుకోవడం ద్వారా రైతుల సమస్యలు పరిష్కారం కావని, సమస్యలపై చర్చించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పోచమ్మకుంటలో గణపయ్యకు 108 రకాల నైవేద్యాలు

- **భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించిన కాలనీ వాసులు**
- **పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు, చిన్నారులు, భక్తులు**

హనుమకొండ/ పోచమ్మకుంట , సెప్టెంబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండలోని 54వ డివిజన్ పోచమ్మకుంటలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ గణేష్ మండలి, పోచమ్మకుంట వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గణపయ్యకు 108 రకాల నైవేద్యాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి కాలనీకి చెందిన మహిళలు, చిన్నారులు, పెద్దలు పెద్ద సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు. అనంతరం గణనాథుని దర్శించుకుని స్వామివారి ఆశీస్సులు పొందారు. భక్తుల సందడితో పోచమ్మకుంటలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.



పెద్దమ్మగడ్డలో రూ.1.43 కోట్లతో ఆరోగ్య కేంద్రం

- **పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం**
- **నూతన అర్బన్ ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్‌కు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ శంకుస్థాపన**

హనుమకొండ, సెప్టెంబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండ నగరంలోని పెద్దమ్మగడ్డ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో భాగంగా రూ.1.43 కోట్ల వ్యయంతో నూతన అర్బన్ ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్ భవన నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొని నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓరుగల్లు ప్రజలకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలకు విద్య, వైద్యం అత్యంత కీలకమని, ఈ రెండు రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. కొత్త ఆరోగ్య కేంద్రం అందుబాటులోకి వస్తే పెద్దమ్మగడ్డతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ప్రాథమిక వైద్య పరీక్షలు, మందులు, ఇతర ఆరోగ్య సేవలు సమీపంలోనే అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. నిర్మాణ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఇతర శాఖల అధికారులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనం నిర్వహించాలి

- **మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించాలి**
- **యువత అత్యుత్సాహానికి దూరంగా ఉండాలి: కొత్తగట్టు రాజేందర్**

గీసుగొండ, సెప్టెంబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి): గణేష్ నిమజ్జనోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని గీసుగొండ మండల ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు కొత్తగట్టు రాజేందర్ కోరారు. నిమజ్జనానికి తరలివెళ్లే గణేష్ మండపాల నిర్వాహకులు, భక్తులు పోలీసులకు సహకరిస్తూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా వేడుకలను నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జన కార్యక్రమంలో మండపాల నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలని, విగ్రహాలను తరలించే సమయంలో భద్రతా చర్యలు పాటించాలని అన్నారు. నిమజ్జన మార్గంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసుల సూచనలు పాటించాలని కోరారు. యువత అత్యుత్సాహానికి దూరంగా ఉండాలని, డీజేలు, ధ్వని వ్యవస్థల విషయంలో అధికారులు సూచించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. చిన్నారులు, మహిళలు, వృద్ధుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గణేష్ నిమజ్జనాన్ని భక్తి, సోదరభావంతో ప్రశాంతంగా నిర్వహించి విజయవంతం చేయాలని కొత్తగట్టు రాజేందర్ పిలుపునిచ్చారు.



ఎమ్మెల్యే నాగరాజును కలిసిన నూతన పీఏసీఎస్ పాలకవర్గం

- **పూలగుచ్ఛంతో మర్యాదపూర్వక భేటీ**
- **సహకారానికి కృతజ్ఞతలు**
- **రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యం : చైర్మన్ అబిడి రాజిరెడ్డి**

వరంగల్/వర్ధన్నపేట, సెప్టెంబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి): వర్ధన్నపేట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) నూతన పాలకవర్గం కొలువుదీరిన నేపథ్యంలో చైర్మన్ అబిడి రాజిరెడ్డి తన పాలకవర్గ సభ్యులతో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజును మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజుకు పూలగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. పీఏసీఎస్ చైర్మన్ ఎన్నికతో పాటు నూతన పాలకవర్గం ఏర్పాటులో సహకరించినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

రైతుల ప్రయోజనాలే ప్రధాన అజెండా

నూతన బాధ్యతలు చేపట్టిన అనంతరం పీఏసీఎస్‌ను మరింత బలోపేతం చేసి రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని చైర్మన్ అబిడి రాజిరెడ్డి తెలిపారు. సహకార సంఘం ద్వారా రైతులకు అవసరమైన సేవలను మరింత విస్తరించడంతో పాటు సంస్థను బహుముఖంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





చిన్నారి పూజకు నూతన వస్త్రాలు, ఫల పుష్పాలంకరణ

- **ములుగు జిల్లా కాంగ్రెస్ నాయకురాలు మడే పూర్ణిమ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం**
- **ఆదివాసీ కుటుంబానికి అభినందనలు తెలిపిన మడే పూర్ణిమ**

ములుగు జిల్లా / తాడ్వాయి , సెప్టెంబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి) : తాడ్వాయి మండలం కట్టునర్సాపూర్ గ్రామానికి చెందిన మంకిడి లక్ష్మణ్–సరస్వతి దంపతుల కుమార్తె చిన్నారి పూజకు నూతన వస్త్రాలు, ఫల పుష్పాలంకరణ కార్యక్రమం హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ములుగు జిల్లా కాంగ్రెస్ నాయకురాలు మడే పూర్ణిమ హాజరై చిన్నారి పూజకు నూతన వస్త్రాలు ధరింపజేసి, ఫల పుష్పాలతో అలంకరించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మడే పూర్ణిమ మాట్లాడుతూ మంకిడి లక్ష్మణ్ పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తుండగా, ఆయన సతీమణి సరస్వతి ఉపాధ్యాయురాలిగా సేవలందిస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణతో పాటు తమ పిల్లలకు మంచి విద్యను అందిస్తూ ఆదివాసీ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని అభినందించారు. పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్ది మంచి స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తాడ్వాయి మండలం మాజీ ఎంపీపీ వాణిశ్రీ, మంచెడి నరసమ్మ, ఆదివాసీ జాతీయ నాయకుడు పంకిడి బుచ్చయ్య సతీమణి తదితరులు పాల్గొని చిన్నారి పూజను ఆశీర్వదించారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

మట్టి గణపతుల నిర్వాహకులకు ఘన సత్కారం

- గంగాపురి యూత్ గణపతి వద్ద అన్నదానం నిర్వహించిన అట్టే శ్యామ్ కుమార్ కుటుంబ సభ్యులు



హనుమకొండ, సెప్టెంబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ మహానగర గణపతి నవరాత్రి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో హనుమకొండలోని కాళోజీ కళా క్షేత్రంలో ఉత్తమ మట్టి గణపతుల బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, పోలీస్ కమిషనర్ శ్వేత ఐపీఎస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో పెట్టుకుని మట్టి గణపతులను ప్రతిష్ఠించిన మండపాల నిర్వాహకులను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, పోలీస్ కమిషనర్ శ్వేత అభినందించారు. ఉత్తమ మట్టి గణపతుల విభాగంలో మడికొండ కింగ్ స్టార్ యూత్ అసోసియేషన్‌కు మొదటి బహుమతి, వరంగల్ రాంకీ విలాస్ గజానన మండలికి రెండో బహుమతి అందజేశారు.

ప్రశాంతంగా నిమజ్జనం నిర్వహించాలి

నగరంలో బుధవారం నిర్వహించనున్న గణపతి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సమన్వయంతో నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే నాయిని సూచించారు. మండపాల నిర్వాహకులు నిర్ణయించిన సమయానికి నిమజ్జనానికి బయలుదేరి, పోలీస్ శాఖ సూచించిన మార్గాల్లోనే ప్రయాణించాలని కోరారు. నిమజ్జన ప్రక్రియ సకాలంలో పూర్తయ్యేలా మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని అన్నారు. భక్తులు, యువత క్రమశిక్షణ పాటిస్తూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా గణపతి ఉత్సవాలను విజయవంతంగా ముగించాలని సూచించారు.

నూతన మైనార్టీ సంక్షేమ అధికారికి ఘన సన్మానం



పెద్దపల్లి జిల్లా/మంథని, సెప్టెంబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి): పెద్దపల్లి జిల్లా నూతన మైనార్టీ సంక్షేమ అధికారి రవిని ఎంసీపీఎఫ్ కమిటీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎంసీపీఎఫ్ అధ్యక్షుడు ఐ. డేవిడ్ మాట్లాడుతూ క్రైస్తవ మైనార్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు సహకరించాలని కోరారు. మైనార్టీ సమాజ అభివృద్ధికి తనవంతు ప్రోత్సాహం అందిస్తూ సంక్షేమ పథకాల అమలులో ప్రత్యేక శ్రద్ధ చూపాలని నూతన అధికారిని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఎఫ్ ఉపాధ్యక్షుడు జయరాజ్, కార్యదర్శి అశోక్ కర్నూరి, కో-కార్యదర్శి జోషి, కార్యవర్గ సభ్యులు సుదర్శన్, నవీన్, బెంజిమెన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఈఓగా ఏ.కృష్ణ బాధ్యతల స్వీకరణ

- రామ్మన్నపేట దేవస్థానం అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్ష
- నూతన కార్యనిర్వహణాధికారికి పలువురి శుభాకాంక్షలు



వరంగల్, సెప్టెంబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ నగరంలోని రామ్మన్నపేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం నూతన కార్యనిర్వహణాధికారిగా ఏ. కృష్ణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. దేవస్థాన కార్యాలయంలో ఆయన అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా దేవస్థాన సిబ్బంది, భక్తులు, పలువురు శ్రేయోభిలాషులు ఏ. కృష్ణకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో దేవస్థానం మరింత అభివృద్ధి చెందాలని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆశీస్సులు నూతన కార్యనిర్వహణాధికారిపై ఎల్లప్పుడూ ఉండాలని భక్తులు కోరుకున్నారు.

దాస్యం వినయ్ భాస్కర్‌ను పరామర్శించిన మరుపల్లి రవి

- ఎంజీఎం ఆస్పత్రిలో ఘటనపై మాజీ చీఫ్‌ను అడ్డుకున్న పోలీసులు
- గాయాలపై ఆరా ప్రజా సమస్యలను ప్రశ్నించే నాయకుల గొంతు నొక్కే ప్రయత్నం: మరుపల్లి రవి



వరంగల్, సెప్టెంబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ నగరంలోని ఎంజీఎం ఆస్పత్రిలో రోగులు ఉన్న భవనం పైకప్పు పెచ్చులు ఊడి పడిన ఘటనను పరిశీలించేందుకు వెళ్లిన మాజీ చీఫ్ దాస్యం వినయ్ భాస్కర్‌ను పోలీసులు అడ్డుకుని గాయపరిచారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ప్రస్తుతం నగరంలోని అజారా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వినయ్ భాస్కర్‌ను 40వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మరుపల్లి రవి మంగళవారం పరామర్శించారు. సంఘటన వివరాలు, గాయాల తీవ్రత, వైద్య చికిత్సపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మరుపల్లి రవి మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన, నిర్బంధ పాలన కొనసాగుతోందని ఆరోపించారు. ప్రజా సమస్యలను ప్రశ్నించే నాయకుల గొంతు నొక్కేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ప్రజా సమస్యలపై స్పందించే నాయకులను అడ్డుకోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ విధానాలు మారకుంటే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

ములుగులో పర్యాటక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

- చారిత్రక ఆలయాల వద్ద పారిశుద్ధ్యం, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి
- ఈ నెల 25న పాలంపేటలో హెరిటేజ్ వాక్



ములుగు జిల్లా , సెప్టెంబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి): ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం తన చాంబర్‌లో ప్రపంచ పర్యాటక దినోత్సవ కార్యక్రమాల ఏర్పాట్లు, నిర్వహణపై పర్యాటక, విద్య, పురావస్తు, అటవీ తదితర శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని చారిత్రక ఆలయాల వద్ద పారిశుద్ధ్య నిర్వహణతో పాటు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. యువ పర్యాటక క్లబ్బుల్లో నమోదైన విద్యార్థులకు పర్యాటకం, వారసత్వ సంపదపై మండల, జిల్లా స్థాయిలో వ్యాస రచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 25న వెంకటాపూర్ మండలం పాలంపేటలోని గొల్లల గుడి వద్ద పర్యాటక శాఖ ఆధ్వర్యంలో వారసత్వ నడక కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు. ఇందులో యువ పర్యాటక క్లబ్ విద్యార్థులు, యువత, అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే రామప్ప ఆలయ ప్రాంగణంలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు పర్యాటక శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెల 26న ఉదయం 8 గంటలకు తెలంగాణ దర్శిని కార్యక్రమంలో భాగంగా యువ పర్యాటక క్లబ్ విద్యార్థులకు జిల్లాలోని చారిత్రక ప్రదేశాలను సందర్శించేలా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా, అదనపు కలెక్టర్ సంపత్ రావు, ఇన్‌చార్జి జిల్లా పర్యాటక శాఖ నోడల్ అధికారి ధర్మ నాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వంలో వరంగల్‌కు కొత్త రూపు తీసుకొస్తాం

- మామునూరు విమానాశ్రయం, భూగర్భ డ్రైనేజీ, రింగ్‌రోడ్, తాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి
- ప్రతి అభివృద్ధి పనికి గడువు నిర్ణయించాం



హనుమకొండ, సెప్టెంబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ నగరాన్ని హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యానికి అనుగుణంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం హనుమకొండ డీసీసీ భవన్‌లో డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రాంరెడ్డితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్ అభివృద్ధిపై సోమవారం రాత్రి 11 గంటల వరకు సమగ్ర సమీక్ష నిర్వహించామని, చేపట్టిన ప్రతి పనికి గడువు నిర్ణయించి, ఎప్పటిలోగా పూర్తి చేయాలన్న దానిపై స్పష్టమైన కార్యాచరణ రూపొందించామని తెలిపారు. మామునూరు విమానాశ్రయం, భూగర్భ డ్రైనేజీ, రింగ్‌రోడ్, ఆసుపత్రులు, ఫిల్టర్‌బెడ్, దేవాలయాల అభివృద్ధి తదితర కీలక ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు.

మామునూరు విమానాశ్రయంపై ప్రత్యేక దృష్టి

మామునూరు విమానాశ్రయానికి భూసేకరణ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.300 కోట్లు విడుదల చేసిందని నాయిని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతగా భూమిని సమకూర్చుతున్నందున విమానాశ్రయ నిర్మాణం, తదుపరి ప్రక్రియలో కేంద్ర ప్రభుత్వం తన బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. విమానాశ్రయానికి ఏ పేరు పెట్టాలన్నది ప్రజల అభిప్రాయాలతో నిర్ణయించుకోవచ్చని ఆయన అన్నారు. దీనిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేస్తున్న వ్యాఖ్యలు అనవసరమని పేర్కొన్నారు. గాంధీ కుటుంబంపై చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు. దేశం కోసం త్యాగాలు చేసిన కుటుంబాన్ని విమర్శించే ముందు చరిత్రను పరిశీలించుకోవాలని అన్నారు.

రూ.550 కోట్లతో తాగునీటి ప్రాజెక్టు

ఒడ్డేపల్లి ఫిల్టర్‌బెడ్‌కు సుమారు రూ.550 కోట్లతో ప్రాజెక్టును తీసుకొచ్చామని నాయిని తెలిపారు. టెండర్లు పూర్తయ్యాయని, పనులు ప్రారంభమయ్యాయని, నిర్మాణ సామగ్రి కూడా ప్రదేశానికి చేరుతోందన్నారు. రానున్న 30 నుంచి 40 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని తాగునీటి వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. జీవోలు జారీ చేసి వదిలేయడం తమ ప్రభుత్వ విధానం కాదని, నిధులు విడుదల చేసి, టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. గత పాలనలో వరంగల్‌కు వచ్చిన స్మార్ట్‌సిటీ నిధులను పూర్తిస్థాయిలో ఎందుకు వినియోగించలేకపోయారో అప్పటి పాలకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధం

వరంగల్‌లో జరుగుతున్న అభివృద్ధిని చూసి కొందరు రాజకీయ విమర్శలకు దిగుతున్నారని నాయిని ఆరోపించారు. గత పదేళ్లలో వరంగల్‌కు ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. గత పాలనలో అవినీతి, ఆస్తులకు సంబంధించిన అంశాలపై తాను చేసిన ఆరోపణలకు సంబంధిత నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సామాజిక మాధ్యమాల్లో ఒక అబద్ధాన్ని పదిసార్లు ప్రచారం చేసినంత మాత్రాన అది నిజం కాదని అన్నారు. ప్రజలు ఎవరు పనిచేస్తున్నారో, ఎవరు కేవలం విమర్శలు చేస్తున్నారో గమనిస్తున్నారని పేర్కొన్నారు. వ్యక్తిగత ఆరోపణలు, రాజకీయ విమర్శలకంటే వరంగల్ అభివృద్ధిపై చర్చకు రావాలని, తాము పూర్తి వివరాలతో కూడిన ప్రగతి నివేదికను ప్రజల ముందు ఉంచేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలూ ఒకటేనని నాయిని ఆరోపించారు. రామ మందిరానికి సంబంధించిన చోరీ ఘటనలో బీజేపీ నాయకులపై ఆయన ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలకు సంబంధించి ఆయన ఎలాంటి ఆధారాలను సమావేశంలో వెల్లడించలేదు. వచ్చే నెల దసరా లోపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్‌కు రానున్నారని, కాకతీయ విశ్వవిద్యాలయం 50 ఏళ్ల వేడుకలు, ఆర్ట్స్ కళాశాల శతాబ్ది ఉత్సవాలతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని నాయిని తెలిపారు. హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో వరంగల్‌ను కీలక నగరంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తోందన్నారు. "మా సమాధానం మాటల్లో కాదు.. జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ఉంటుంది" అని స్పష్టం చేశారు. సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాసరావు, అనుమాముల మార్కెట్ చైర్మన్ పులి ప్రియాంక, కమలాపూర్ మార్కెట్ చైర్మన్ రాణి, మాజీ కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, శ్రీమాన్, విజయశ్రీ రజాలి, జక్కుల రవీందర్‌యాదవ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ తదితరులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

టీబీ ముక్త్ భారత్ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- **క్షేత్రస్థాయిలో స్క్రీనింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలిహై రిస్క్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి: కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**



హనుమకొండ, సెప్టెంబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి): టీబీ ముక్త్ భారత్ సాధన కోసం ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్‌పై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టీబీ నియంత్రణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో నిర్వహించే స్క్రీనింగ్ కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టి, వ్యాధి లక్షణాలు ఉన్నవారిని త్వరగా గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా హై రిస్క్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, అనుమానితులను గుర్తించి అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్స అందేలా చూడాలని ఆదేశించారు. హై రిస్క్ కేసులను నిరంతరం పర్యవేక్షిస్తూ వారికి పరీక్షలు, చికిత్స, మందుల వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. మండల స్థాయిలోనూ సమన్వయ సమావేశాలు నిర్వహించి కార్యక్రమం అమలు తీరును ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. ప్రజల్లో టీబీపై అవగాహన పెంచడంతో పాటు వ్యాధిని ముందస్తుగా గుర్తించడం ద్వారా సమర్థవంతంగా నియంత్రించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. టీబీ నిర్మూలన లక్ష్యాన్ని సాధించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.

టీబీ బాధితులకు పోషకాహార కిట్ల పంపిణీ

కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వరంగల్ అధ్యక్షుడు డాక్టర్ మన్మోహన్ రాజు 50 పోషకాహార కిట్లకు అవసరమైన రూ.35 వేల మొత్తాన్ని అందజేశారు. సామాజిక బాధ్యతలో భాగంగా టీబీ, ఛాతీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి. రవి 10 కిట్లు, శాయంపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న బి. మల్లేశం 10 కిట్లు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య 5 కిట్లు, డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రదీప్‌రెడ్డి 5 కిట్లను టీబీతో బాధపడుతున్న వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి గిరిరాజ్ గౌడ్, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి రమాకాంత్, కాకతీయ వైద్య కళాశాల సామాజిక, నివారణ వైద్య విభాగం అధ్యాపకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాత్యాయని ఇండస్ట్రీస్‌పై అధికారుల మౌనం ఎందుకు?

- **కాలుష్యంపై తనిఖీలు జరిగితే.. నివేదికలు ఏమయ్యాయి?**
- **చర్యలు తీసుకుంటామన్న హామీ తర్వాత కూడా స్పష్టత కరువు.. రైతుల్లో అనుమానాలు**





వరంగల్/వర్ధన్నపేట, సెప్టెంబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి): వర్ధన్నపేట నుంచి కొత్తపెల్లి వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న కాత్యాయని ఇండస్ట్రీస్‌కు సంబంధించిన కాలుష్య వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. పరిశ్రమకు సంబంధించిన కాలుష్య సమస్యలపై గతంలో నిత్యం నిఘా వరుస కథనాలు ప్రచురించింది. దీనిపై స్పందించిన కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పరిశీలించి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం. అయితే ఆ హామీ అనంతరం ఇప్పటివరకు తీసుకున్న చర్యలపై స్పష్టత లేకపోవడంతో రైతులు, స్థానికులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.

తనిఖీల్లో ఏం తేలింది?

పరిశ్రమకు సంబంధించిన కాలుష్య అంశాలపై అధికారులు తనిఖీలు నిర్వహించి ఉంటే.. వాటి ఫలితాలు ఏమిటన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. కాలుష్య నియంత్రణ నిబంధనలకు సంబంధించి ఏమైనా ఉల్లంఘనలు గుర్తించారా? గుర్తించి ఉంటే పరిశ్రమ యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారా? తదుపరి చర్యలు ఏమిటి? అన్న విషయాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

ఈఈ హామీ అమలైంది ఎక్కడ?

గతంలో నిత్యం నిఘా కథనాలకు స్పందించిన కాలుష్య నియంత్రణ మండలి ఈఈ చర్యలు తీసుకుంటామని చెప్పినప్పటికీ.. ఆ చర్యలు ఏ దశలో ఉన్నాయన్నది తెలియడం లేదు. తనిఖీ నివేదిక సిద్ధమైందా? పరిశ్రమపై ఏమైనా నోటీసులు జారీ చేశారా? నిబంధనల ఉల్లంఘన నిర్ధారణ అయితే ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అన్న ప్రశ్నలకు అధికారిక సమాధానం రావాల్సి ఉంది.

అధికారుల మౌనంపై స్థానికుల అనుమానాలు,

పరిశ్రమ యాజమాన్యం, అధికారుల మధ్య ఏమైనా అవగాహన ఉందా? చర్యలు తీసుకోవాల్సిన సమయంలో ఎందుకు ఆలస్యం జరుగుతోంది? అంటూ కొందరు స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇవి స్థానికులు వ్యక్తం చేస్తున్న ఆరోపణలు, అనుమానాలు మాత్రమేనని, వాటిని నిర్ధారిత వాస్తవాలుగా పరిగణించలేమని స్పష్టం చేయాల్సి ఉంది.

రైతుల ఆందోళనకు సమాధానం ఎవరు?

పరిశ్రమకు సంబంధించిన కాలుష్యం వల్ల పంటలు, భూగర్భజలాలు, పరిసర ప్రాంతాలపై ప్రభావం ఉందా? అన్న అంశంపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. వాస్తవ పరిస్థితిని శాస్త్రీయంగా పరిశీలించి, తనిఖీల ఫలితాలు, కాలుష్య స్థాయిలు, తీసుకున్న చర్యలను అధికారులు ప్రజలకు వెల్లడించాలని వారు కోరుతున్నారు. "చర్యలు తీసుకుంటామని చెప్పిన అధికారులు.. ఇప్పటివరకు ఏం చేశారు?" అన్న ప్రశ్నకు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉంది.


నిత్యం నిఘా కథనానికి స్పందించిన పర్యావరణ శాఖ..
కాత్యాయని రైస్ మిల్లుపై పొల్యూషన్ బోర్డు తనిఖీలు
వర్ధన్నపేటలో దొంగ మిల్లు వ్యవహారం..

ఇకనైనా ఉన్నతాధికారులు స్పందిస్తారా?

నిత్యం నిఘా కథనాలతో వెలుగులోకి వచ్చిన ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించి వాస్తవ పరిస్థితిని ప్రజలకు తెలియజేయాలని స్థానికులు కోరుతున్నారు. పరిశ్రమకు సంబంధించిన అనుమతులు, తనిఖీ నివేదికలు, కాలుష్య నియంత్రణ చర్యలు, నిబంధనల అమలు తదితర అంశాలపై అధికారికంగా స్పష్టత ఇస్తే అనుమానాలకు తెరపడే అవకాశం ఉంది.

ప్రైవేట్ ఆసుపత్రుల్లో 'కమిషన్' దందా?

- **రోగులను తీసుకొచ్చే మధ్యవర్తులకు ముందే రేట్లు..?**
- **ఆపరేషన్, ప్రసవం, చికిత్సలకూ 'ఫిక్స్‌డ్' కమిషన్ల ఆరోపణలు..**
- **అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు**

హనుమకొండ, సెప్టెంబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండ నగరంలోని కొన్ని ప్రైవేట్ ఆసుపత్రుల్లో రోగులను మధ్యవర్తుల ద్వారా తీసుకురావడం, అందుకు ప్రతిఫలంగా కమిషన్లు చెల్లిస్తున్నారనే ఆరోపణలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. ముఖ్యంగా బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో కొందరు మధ్యవర్తులు రోగులను ఆసుపత్రులకు తీసుకెళ్లే వ్యవహారం సాగుతోందని స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చికిత్సకు ఓ రేటు.. ఆపరేషన్‌కు మరో రేటు?

మధ్యవర్తుల ద్వారా ఆసుపత్రులకు వచ్చే రోగులకు సంబంధించి వివిధ రకాల చికిత్సలు, శస్త్రచికిత్సలు, ప్రసవాలకు ముందుగానే నిర్దిష్ట మొత్తాల్లో కమిషన్లు నిర్ణయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏ రోగిని ఏ ఆసుపత్రికి తీసుకెళ్లాలి? ఎలాంటి చికిత్సకు ఎంత మొత్తం వసూలు చేయాలి? అనే విషయాల్లో కొందరు మధ్యవర్తులు వ్యవహరిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ వ్యవహారంలో ఆసుపత్రుల యాజమాన్యాల పాత్రపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి సంబంధిత ఆసుపత్రుల అధికారిక వివరణ వెలువడాల్సి ఉంది.

రోగి అవసరమా.. కమిషనే ముఖ్యమా?

వైద్యం కోసం ఆసుపత్రిని ఆశ్రయించే రోగి ఆరోగ్య పరిస్థితి, అవసరమైన చికిత్స ఆధారంగా వైద్య నిర్ణయాలు ఉండాల్సినప్పటికీ, కమిషన్ల కోసం రోగులను ఒక ఆసుపత్రి నుంచి మరో ఆసుపత్రికి మళ్లిస్తున్నారనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. రోగి నుంచి వసూలు చేసే చికిత్స ఖర్చులో మధ్యవర్తుల కమిషన్ కూడా ఏదైనా భాగమవుతోందా? ఆసుపత్రుల్లో రోగులను చేర్పించే వ్యక్తులకు ఎంత మొత్తంలో చెల్లింపులు జరుగుతున్నాయి? ఈ వ్యవహారంపై ఆసుపత్రి యాజమాన్యాలకు అవగాహన ఉందా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?

ప్రైవేట్ ఆసుపత్రుల్లో రోగుల చేర్పు విధానం, చికిత్సల ధరలు, శస్త్రచికిత్సల పేరుతో వసూలు చేస్తున్న మొత్తాలు, మధ్యవర్తుల ప్రమేయంపై సంబంధిత వైద్య ఆరోగ్యశాఖ అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు. మధ్యవర్తుల ద్వారా రోగులను తీసుకురావడం, అందుకు కమిషన్లు చెల్లిస్తున్నారనే ఆరోపణలు వాస్తవమైతే బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ప్రశ్నగా మారింది. ఆరోపణలపై అధికారులు విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



సూపరింటెండెంట్ కుర్చీకి ఏమైంది..? వరుసగా మారుతున్న అధికారులు!

- **కొద్దికాలానికే బాధ్యతల నుంచి తప్పుకుంటున్న అధికారులు.. ఆసుపత్రి పరిపాలనపై ప్రశ్నలు**
- **తాజాగా డాక్టర్ వీరిన్ రాజీనామా.. ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ భరత్**



వరంగల్/వర్ధన్నపేట, సెప్టెంబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి): వర్ధన్నపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ కుర్చీ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. ఈ పదవిలో బాధ్యతలు చేపట్టిన అధికారులు కొద్దికాలానికే మారుతుండటంతో ఆసుపత్రి పరిపాలనపై స్థానికంగా పలు ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా జూలై 24న సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ బి. వీరిన్ రాజీనామా చేసినట్లు సమాచారం. దీంతో ఆయన స్థానంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ భరత్ బాధ్యతలు చేపట్టినట్లు తెలిసింది. తాజా పరిణామంతో తదుపరి పూర్తిస్థాయి సూపరింటెండెంట్‌గా ఎవరు నియమితులవుతారన్న చర్చ ఆసుపత్రి వర్గాల్లో మొదలైంది.

వరుస మార్పులతో చర్చ

గతంలోనూ ఈ ఆసుపత్రి సూపరింటెండెంట్ బాధ్యతల్లో పలువురు అధికారులు కొనసాగినప్పటికీ కొంతకాలానికే మారిన సందర్భాలు ఉన్నాయని ఆసుపత్రి వర్గాల్లో చర్చ జరుగుతోంది. విజయలక్ష్మి అనంతరం నరసింహస్వామి కొంతకాలం సుదీర్ఘంగా బాధ్యతలు నిర్వహించినట్లు తెలుస్తోంది. అయితే అనంతరం కూడా సూపరింటెండెంట్ స్థాయిలో మార్పులు చోటుచేసుకున్నాయి.

అసలు కారణమేంటి?

సూపరింటెండెంట్ స్థాయి అధికారి తరచూ బాధ్యతల నుంచి తప్పుకోవడానికి దారితీస్తున్న పరిస్థితులేమిటన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. పరిపాలనా సమస్యలే కారణమా? విధుల నిర్వహణలో ఎదురవుతున్న ఇతర ఇబ్బందులా? లేక వ్యక్తిగత కారణాలా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. డాక్టర్ వీరిన్ రాజీనామాకు సంబంధించిన కారణాలు అధికారికంగా వెల్లడికాకపోవడంతో వివిధ రకాల చర్చలు జరుగుతున్నాయి. అయితే ఆరోపణలు, అనుమానాలను నిర్ధారిత వాస్తవాలుగా పరిగణించకుండా, అధికారులు వాస్తవ పరిస్థితులను స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది. సూపరింటెండెంట్ స్థాయి అధికారి తరచూ మారడం వల్ల ఆసుపత్రి పరిపాలన, వైద్య సిబ్బంది సమన్వయం, రోగులకు అందించే సేవలపై ఎలాంటి ప్రతికూల ప్రభావం పడకుండా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

పోషకాహారంతోనే తల్లి, బిడ్డకు ఆరోగ్యం



జనగామ జిల్లా / రఘునాథపల్లి, సెప్టెంబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి): అంతర్జాతీయ పోషణ మాసం సందర్భంగా రఘునాథపల్లి–1 అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం సీమంతం, అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొల్లం ఉమారాణి, ఏసీడీపీఓ శోభ, సూపరవైజర్ మంజుల, ఆరోగ్యశాఖ మహిళా ఆరోగ్య కార్యకర్తల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులు సూచించారు. గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డకు రెండేళ్లు వచ్చే వరకు తొలి 1,000 రోజులు అత్యంత కీలకమైనవని తెలిపారు. గర్భిణులు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు వైద్యుల సూచన మేరకు ఇనుము, కాల్షియం మాత్రలు తీసుకోవాలని సూచించారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు ఇవ్వాలని, ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలనే అందించాలని, అనంతరం వయసుకు అనుగుణంగా అనుబంధ ఆహారాన్ని ప్రారంభించాలని అవగాహన కల్పించారు. ధాన్యాలు, పప్పులు, కూరగాయలు, ఆకుకూరలు, పాలు, గుడ్లు, చిరుధాన్యాలు వంటి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మరకాల శ్రీలతతో పాటు సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

గణేశుడి సన్నిధిలో భక్తులకు అన్నదానం



జనగామ జిల్లా/రఘునాథపల్లి, సెప్టెంబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి): 'అన్ని దానాల్లో అన్నదానం గొప్పది' అనే భావనతో రఘునాథపల్లి మండల కేంద్రంలోని గిర్నిగడ్డ సమీపంలో గణేశ నవరాత్రి ఉత్సవాలను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా యువనేత దుబ్బాక హరీష్ గౌడ్, నీరజ దంపతులతో పాటు దుబ్బాక కుటుంబ సభ్యులు గణేశుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారి ఇంటి సమీపంలో భక్తులు, గ్రామస్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు, గ్రామస్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా దుబ్బాక హరీష్ గౌడ్ దంపతులు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం గణేశుడి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు చింతకింది కృష్ణమూర్తి, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కోళ్ల రవి గౌడ్, గౌడ సంఘం జిల్లా నాయకులు బాల్నే పరశురాములు గౌడ్, దుబ్బాక నర్సింహులు, మరకల మహేందర్, జీకేఆర్, నోముల మహేందర్, సురుగు రమేష్, సురుగు హరీష్, డీజే మహేందర్, శత్రసి రాము, కంటడి రోహిత్, చెరుకు అజయ్, పొలస నాగరాజు, సురుగు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు చేరువగా సహకార సంఘాలు పనిచేయాలి



వరంగల్/పర్వతగిరి, సెప్టెంబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి): పర్వతగిరి సొసైటీ చైర్మన్ పిన్నింటి అనిల్‌రావు, చౌటపల్లి సొసైటీ చైర్మన్ అతి కుమారస్వామి, ఆయా సహకార సంఘాల కార్యవర్గ సభ్యులు మంగళవారం సుబేదారిలోని వర్ధన్నపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు సొసైటీ చైర్మన్లు, కార్యవర్గ సభ్యులను శాలువాలతో సత్కరించి అభినందించారు. అనంతరం సహకార సంఘాలు రైతులకు మరింత చేరువగా పనిచేయాలని, రైతుల అవసరాలకు అనుగుణంగా సేవలు అందించాలని సూచించారు. రైతుల సమస్యల పరిష్కారానికి సహకార సంఘాలు చురుగ్గా పనిచేయాలని, రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే సూచించారు. సహకార సంఘాల బలోపేతానికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో పర్వతగిరి, చౌటపల్లి సహకార సంఘాల కార్యవర్గ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు..

పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో వినాయకుడికి ప్రత్యేక పూజలు

- **కుటుంబ సభ్యులతో కలిసి పూజల్లో పాల్గొన్న వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత**
- **అధికారులు, సిబ్బంది సంక్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు**



వరంగల్, సెప్టెంబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ కుటుంబ సభ్యులతో కలిసి వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన పోలీస్ కమిషనర్.. పోలీసు అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల సంక్షేమం, శాంతి, సౌభాగ్యం కోసం ప్రార్థించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు శ్రీనివాసు, సురేష్, ఏసీపీలు నాగయ్య, సురేందర్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు సతీష్, ఉదయభాస్కర్, శ్రీధర్‌తో పాటు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో భక్తి, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

17వ వసంతంలోకి వావిలాల యంగ్ స్టార్స్ యూత్

- **2009లో కొద్దిమందితో మొదలై.. నేడు యువతకు వేదికగా**
- **మట్టి వినాయకుడి ప్రతిష్ఠతో పర్యావరణ సందేశం..లడ్డూ వేలంపై గ్రామంలో ఆసక్తి**





మహబూబాబాద్, సెప్టెంబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి): గణేష్ లడ్డూ వేలంపాట అంటే వావిలాల గ్రామస్థులకు ప్రత్యేక ఆసక్తి. వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించడం ఈ ఏడాది ప్రత్యేకతగా నిలిచింది. యువత అంటే కేవలం ఉత్సాహం, వినోదం మాత్రమే కాదని.. గ్రామ అవసరాల్లోనూ తమ వంతు బాధ్యత తీసుకోవచ్చని చాటుతూ మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం వావిలాల గ్రామానికి చెందిన యంగ్ స్టార్స్ యూత్ అసోసియేషన్ 17వ వసంతంలోకి అడుగుపెట్టింది. 2009లో కొద్దిమందితో మొదలు..భైరి రంజిత్‌కుమార్, మద్దెల రాజేష్ ఆధ్వర్యంలో 2009లో కొద్దిమంది యువకులతో యంగ్ స్టార్స్ యూత్ అసోసియేషన్ ప్రారంభమైంది. గ్రామ యువతను ఒకే వేదికపైకి తీసుకురావడం, యువతలో ఐక్యత పెంపొందించడం, గ్రామ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం, అవసరమైన సందర్భాల్లో ప్రజలకు సహకరించాలన్న లక్ష్యంతో ప్రస్థానం ప్రారంభమైంది. కాలక్రమంలో సభ్యుల సంఖ్య పెరగడంతో పాటు కార్యకలాపాలు విస్తరించాయి. సుమారు 15 ఏళ్లపాటు సంస్థకు నాయకత్వం వహించిన స్థాపకులు బలమైన పునాదులు వేశారు.

స్థాపకుల పునాదులపై.. కొత్త నాయకత్వం

యంగ్ స్టార్స్ యూత్ ప్రస్థానంలో స్థాపకులైన భైరి రంజిత్‌కుమార్, మద్దెల రాజేష్ సేవలను ప్రస్తుత సభ్యులు గుర్తుచేసుకుంటున్నారు. యువతను కలుపుకొని కార్యక్రమాలు నిర్వహించడం, అందరినీ సమానంగా గౌరవించడం, గ్రామ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడం వంటి విలువలను వారు ముందుకు తీసుకెళ్లారని సభ్యులు చెబుతున్నారు. ప్రస్తుతం అధ్యక్షుడు నాళ్లం రఘుపతి, ఉపాధ్యక్షుడు మారగాని అశోక్ ఆధ్వర్యంలో యూత్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి.

మట్టి వినాయకుడితో పర్యావరణ సందేశం

వినాయక నవరాత్రి ఉత్సవాల్లో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ఈ ఏడాది మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించారు. నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజలు, భక్తి, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. గ్రామ ప్రజలు ఉత్సవాల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొంటుండగా.. యువతే బాధ్యతలను పంచుకుని కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

లడ్డూ వేలం.. ఎంత పలుకుతుందో?

వావిలాలలో వినాయకుడి లడ్డూ వేలంపాటకు ప్రత్యేక ఆదరణ ఉంది. వేలంలో లడ్డూను దక్కించుకుంటే మంచి జరుగుతుందన్న నమ్మకం స్థానికుల్లో ఉందని గ్రామస్థులు చెబుతున్నారు. దీంతో ప్రతి ఏడాది వేలంపాటపై ఆసక్తి నెలకొంటోంది. గతేడాది లడ్డూ రూ.60 వేల ధర పలికింది. ఈ ఏడాది ఎంత ధర పలుకుతుందనే ఉత్కంఠ గ్రామస్థుల్లో నెలకొంది. భక్తి కార్యక్రమాలతో పాటు లడ్డూ వేలంపాట కూడా ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా మారింది.

పండుగలకే పరిమితం కాకుండా.. సేవా బాటలో

యంగ్ స్టార్స్ యూత్ కార్యకలాపాలు వినాయక నవరాత్రులకే పరిమితం కావడం లేదు. గ్రామంలో సామాజిక



కార్యక్రమాలు, పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణ, అవసరమైన సందర్భాల్లో ప్రజలకు సహకారం వంటి కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యమవుతోంది. 2009లో కొద్దిమంది యువకులతో వెలిగిన చిన్న ఆలోచన.. నేడు 17వ వసంతానికి చేరుకుంది. స్థాపకులు వేసిన పునాదులపై ప్రస్తుత నాయకత్వం బాధ్యతలు స్వీకరించి ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. యువత ఐక్యతను కాపాడుకుంటూ గ్రామానికి ఉపయోగపడే మరిన్ని కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడమే తమ లక్ష్యమని యంగ్ స్టార్స్ యూత్ సభ్యులు చెబుతున్నారు.

ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ.. నిందితుడి అరెస్ట్



పెద్దపల్లి జిల్లా / మంథని, సెప్టెంబర్ 22 (నిత్యం నిఘా ప్రతినిధి): మంథని పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేసిన కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో తాటికొండ స్వామిశరణ్ అలియాస్ మున్నా అనే 21 ఏళ్ల వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు, చోరీకి గురైన ఆభరణాలతో పాటు నంబర్ ప్లేట్ లేని మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. మరో వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.పోలీసుల వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 17 రాత్రి నుంచి 18వ తేదీ ఉదయం మధ్య మంథని మండలం అడవిసోమనపల్లి గ్రామంలోని పంగా శ్రీకాంత్ ఇంటి తాళాలను గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి, అల్మారాలోని బంగారు, వెండి ఆభరణాలను అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మంథని పోలీస్‌స్టేషన్‌లో నేరం నంబర్ 224/2026గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.దర్యాప్తులో భాగంగా సమీపంలోని కిరాణా దుకాణం వద్ద ఉన్న సీసీ కెమెరాల దృశ్యాలను పోలీసులు పరిశీలించారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా మంగళవారం మధ్యాహ్నం సుమారు 2.30 గంటలకు మంథని 'వై' జంక్షన్ వద్ద మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో చోరీకి పాల్పడినట్లు వారు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి బాధితుడికి చెందిన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. బంగారు ఆభరణాలను బంగారు వ్యాపారి సమక్షంలో తూకం వేయించి పంచనామా నిర్వహించినట్లు వెల్లడించారు. నంబర్ ప్లేట్ లేని హీరో హోండా ప్యాషన్ ప్రో మోటార్ సైకిల్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు.నిందితుడిపై గతంలోనూ కేసులు, అరెస్టయిన తాటికొండ స్వామిశరణ్ అలియాస్ మున్నా ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రా గ్రామానికి చెందినవాడని, ప్రస్తుతం మంచిర్యాల రాజీవ్‌నగర్‌లో నివసిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వృత్తిరీత్యా పెయింటర్‌గా పని చేస్తున్నాడని వెల్లడించారు. దర్యాప్తులో స్వామిశరణ్‌పై గతంలో కాటారం, ఘన్‌పూర్, సుబేదారి, మంథని, పస్రా, మంచిర్యాల టౌన్, నస్పూర్, హాజీపూర్ తదితర పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోరీలు, ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ చేసిన కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఆభరణాలు, పోలీసులు స్వాధీనం చేసుకున్న వాటిలో 23.2 గ్రాముల బంగారు నెక్లెస్, 2.7 గ్రాముల బంగారు ఉంగరం, 3.15 గ్రాముల బంగారు లాకెట్, 2.6 గ్రాముల చెవి ఆభరణాలు, 2.8 గ్రాముల మాటీలు, 0.8 గ్రాముల చిన్న లాకెట్, 2.9 గ్రాముల బంగారు ముద్దతో పాటు రెండు జతల వెండి పట్టీలు, ఆరు వెండి కడియాలు, వెండి నడుము దారం, వెండి మెట్టెలు ఉన్నాయి. వీటితో పాటు నంబర్ ప్లేట్ లేని హీరో హోండా ప్యాషన్ ప్రో మోటార్ సైకిల్ ను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన స్వామిశరణ్‌ను మంథని ప్రిన్సిపల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టులో హాజరుపరిచి న్యాయ రిమాండ్‌కు తరలించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. మరో వ్యక్తికి సంబంధించి తదుపరి దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపారు. కేసును ఛేదించిన మంథని పోలీసులను రామగుండం పోలీస్ కమిషనర్ అభినందించినట్లు సీఐ బి. స్వామి తెలిపారు. అనుమానాస్పద వ్యక్తుల సంచారం లేదా ఇంటి తాళాలు పగులగొట్టే ఘటనలు గమనించిన ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పోలీసులు కోరారు.

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com